కథానిక

# గెలుపు - ఓటమి

ఇచ్ఛాపురపు జగన్నాథరావు

మేడమీద గదిలో వాసు కూర్చుని సిగరెట్ ముట్టించాడు టేబిల్ మీద టిన్‌లోంచి తీసి.

కిటికీలోంచి చక్కటి దృశ్యం కనిపిస్తోంది. దూరంగా నల్లని కొండలూ, పచ్చని పొలాలూ, నీలి ఆకాశమూ; మధ్యన ఎర్రగా పూవులు విరియబూసిన మోదుగు. వాసు ఆ దృశ్యం చూసి ఒక్కసారి చిరునవ్వు నవ్వాడు. సిగరెట్ మరొక దమ్ములాగి, రేడియో ట్యూన్ చేశాడు.

హిందూస్తానీ శాస్త్రీయ సంగీతం వస్తోంది ఏదో స్టేషన్‌లోంచి. సినిమా సంగీతమంటే చెవి కోసుకునే వాసుకి చాలా కష్టం అనిపించింది ఆ సంగీతం వినడానికి.

ముల్లు కదిలి కదిలి ఏదో పాశ్చాత్య సంగీతం దగ్గర ఆగింది. హాయిగా వినవచ్చే ఆ సంగీతానికి లయ వేస్తూ, బైటదృశ్యం చూస్తూ, వాసు సిగరెట్ కాలుస్తున్నాడు.

నోటినిండా ఉన్న పొగ ఒక్కసారి పెదిమెలమీదనించి వదిలాడు. రేడియోని చుట్టుముట్టి కొంతపొగ, కిటికీలోంచి మాయమవుతూ, ప్రకృతిలో కనపడని ఒక రంగుతో, రుచితో, సంగీతం ఇవ్వని సౌఖ్యం ఇస్తోంది. సిగరెట్— వాసు మరొక్కదమ్ము పీల్చి తృప్తిగా చూశాడు సిగరెట్ వంక. పూర్వం ఎవడో సిగరెట్‌ని ఒకవేపు నిప్పు, మరొకవైపు ఇంకో మూర్ఖుడూ ఉండే ఒక తెల్లని స్థూపకాకారం అని నిర్వచించాడట! దద్దమ్మ! ఒక్క సిజర్ సిగరెట్ ముద్దుగా కాలిస్తే ఆమాట అని ఉన్నందుకు తనకి తానే శిక్ష విధించుకుని, ఓ సిగరెట్ దండకం చేసి పారవేసేవాడు!

సిగరెట్ అయిపోవచ్చింది. వెళ్ళిపోయే శిశువుని మరోసారి గాఢంగా ముద్దాడి పంపివట్లు వాసు సిగరెట్‌ని బలంగా మరో రెండు దమ్ములు లాగి, కిటికీలోంచి గిరవాటు వేసి పొగనంతటినీ ఒక్కసారి వదిలాడు.

అప్పుడే వస్తోన్న శకుంతల గుమ్మందగ్గర నించీ చేతితో ఈగలని లాగా పొగని తోలుతూ "బొత్తిగా పాడైపోయావు వాసూ?" అంది కాఫీకప్పు బల్ల మీద వుంచి.

వాసు కొంచెం సిగ్గుపడ్డాడు. టిన్‌లో సిగరెట్స్ వదిన చూడకుండా మూత వేస్తూ "నువ్వే తెచ్చావేం వొదినా? నేను పిలిస్తే రానూ?" అన్నాడు. తాపత్రయం ఎలాగేనా సంభాషణ మార్చడానికి.

"పిల్చాను బాబూ. నీకు వినపడందే. చల్లారిపోతుందని నేనే తెచ్చాను. తాగ-చూస్తావేం?"

వాసు కాఫీ పూర్తిచేసి నేరం చేసిన వాడిలాగ కప్పు టేబిల్ మీద వుంచాడు. వదిన అంటే అతనికి విపరీతమైన గౌరవం. అయిదేళ్ళక్రిందట అమ్మ పోయినప్పటినించీ వదిన అమ్మ తనే అయి చేస్తోంది. మచ్చుకి కఠినంగా మాటలాడక, తన మనస్సు గ్రహించి అన్నీ చేస్తోంది. వాసు రేడియోని ఆపివేశాడు, వదిన విసుక్కుంటుందేమో నని. శకుంతలకి పాశ్చాత్య సంగీతం కిట్టదు.

"ఆపేశావేం? బాగుంది. ఉంచుకోలేక పోయావా?"

చిరునవ్వు నవ్వి వాసు: "ఒద్దులే వదినా. ఊరికే తోచక పెట్టాను" అన్నాడు. ఉంచుకోవడంలో అర్థం అతనికి తెలుసును.

"నీతో ఒకమాట చెప్పాలి వాసూ!"

తలయెత్తి వదిన కళ్ళల్లోకి చూశాడు వాసు. ఇలాటి మాటలు ఆమె తరుచు అనదు. వాసు గుండీలు సర్దుకుంటూ 'చెప్పు వదినా'' అన్నాడు.

కొంచెం ఆగి శకుంతల: "మీ అమ్మ ఉంటే నువ్విలాగ చెడిపోతోంటే చూస్తూ ఊరుకునేదా వాసూ?" అంది గంభీరంగా. ఆ గాంభీర్యంలో

ప్రేమ లేకపోలేదు; కాని ఆమె ప్రేమకూడా క్రమశిక్షణ తరువాతనే.

వాసు తలవంచుకుని "నేనేం చేశాను వదినా?" అన్నాడు చాలా నొచ్చుకున్నట్లు దీనంగా.

"ఏమీలేదు వాసూ మీ నాన్నగారూ, అన్నయ్యా, ఎవ్వరూ సిగరెట్లు కాల్చలేదు. నువ్వా బుద్ధిమంతుడివి. ఎంత ఆరోగ్యం పాడు చేసుకుంటావిలాగ? రెండువిధాలా బాగులేదమ్మా ఇది—"

శకుంతల వద్దనుకున్నా ఆమె గొంతుకలోకి ఆర్ద్రత వచ్చింది. వాసుకి ప్రాణం లేచి వచ్చినట్లయింది. కాని ఆమెకేం చెప్పడం అని అతను తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

"మా అన్నయ్య ఏమీ అనలేక ఊరుకున్నారు. నేనూ చూస్తూ ఎలాగ ఊరుకునేది చెప్పు?"

కొంచెం నిశ్శబ్దం తరువాత వాసు మాటలాడ కలిగాడు. తల వంచుకొనే "సిగరెట్లు కాల్చడం పాతకమా వదినా?" అన్నాడు. నిజంగా తెలియక—

"కాదు బాబూ. కాని ఆరోగ్యం చెరిచే ఏపనీ నువ్వు చెయ్యకూడదు. సిగరెట్ ఆరోగ్యం చెరుస్తుందంటావా లేదా?"

ఈ ప్రశ్నకి వాసు జవాబివ్వలేదు. కొంచెం ఊరుకుని, దీనంగా వదిన కళ్లల్లోకి చూస్తూ, "నా తప్పు ఈ ఒక్కటీ నువ్వు సహించలేవా వదినా?" అన్నాడు.

శకుంతల నవ్వింది. ఆ నవ్వులో ఎంత మాతృత్వం! పసిపాప బోసినోటి ముత్యాల కోసం నవ్వినట్లు.

"అదేమిటి వాసూ అలాగు అవుతావు? నేనేం ఇది తప్పన్నానా? ప్రయత్నించమన్నాను. పోనీలే అంతగా అలవాటయితే."

శకుంతల గదిలోంచి వెళ్ళిపోయింది. సిగరెట్ ముట్టించి వాసు ఆలోచనలో పడ్డాడు.

* * *

శ్యామలకి జడవేసి పువ్వులు పెట్టి, తిలకం దిద్దుతూ, శకుంతల "ఈసారితో మా వాసు పని సరేలే" అంది నవ్వుతూ.

తల వంచుకుని శ్యామల "నీచేతి చలువేలే అక్కా" అంది.

"ఈకబుర్లు కాదు కాని—ఒక పని చెయ్యాలి."

శ్యామల ఆశ్చర్యంగా చూస్తూ "ఏమిటో అది?" అంది.

"వాసు చేత సిగరెట్లు మాన్పించావంటే నీకు బహుమానమిస్తాను. మనిషి పాడైపోతున్నాడు బొత్తిగా సిగరెట్లు ఎక్కువై"

"ఎలాగ?" అన్నట్లు చూసి శ్యామల తలవంచుకుంది. గ్రహించి, శకుంతల చిన్నగా నవ్వుతూ "తెలివిగా నడవాలమ్మా పిల్లలు. అసలు వాటిమీద చెయ్యివెయ్యనియ్యకు మాట ఇస్తేగాని" అన్నది.

మౌనంగా శ్యామల తల వంచుకుంది.

మనస్సుకీ, మన్మథునికీ పందెం!

* * *

ఉక్కిరిబిక్కిరి అయి దగ్గుతూ, "పాడు పొగ ఏమి సిగరెట్లండీ అవి?" అంది శ్యామల పొగని చేతితో విదిలిస్తూ—

"ఇవా? వీటిని సిజర్స్ సిగరెట్లంటారు."

శ్యామల వాసుని విడిపించుకుని దూరంగా పోయి కూర్చుంది కోపంగా. తీరుబడిగా సిగరెట్ పూర్తిచేసి, శ్యామల దగ్గరకి వచ్చాడు.

"కోపం వచ్చిందా?"

"రాదూ మరి?—ఆ పాడుపొగా, నోరు వాసనాను"

"కిళ్లీ వేసుకొన్నానుగా అంత వాసన ఎలాగ వేసింది? అయినా నీ పెదిమలు చూడనీ"

కోపంగా దూరంగా తోసివేసింది శ్యామల. వాసు నవ్వుతూ, "కొంచెం సర్దుకోవాలి మనుషులు" అన్నాడు.

"మీరూ మనుష్యులేగా?"

ఏమైనా శ్యామల వాసుని దగ్గరకురానియ్యలేదు. అతని నోరు వేసే వాసన ఆమెకి నిజంగా కిట్టలేదు; శకుంతల సవాలూ చేసింది! అదీకాక, అదీకాక, సిగరెట్లకి ఎంతడబ్బు తగలెట్టడం?

"మీరూ మనుషులేగా?"

వాసు తృళ్ళిపడి వెనక్కి తగ్గి టేబిల్ మీద టిన్నులోంచి సిగరెట్ తీసి ముట్టించాడు. పొగ అగరొత్తుల పొగతో జట్టుకట్టి ప్రాకుతోంది.

తన సిగరెట్ల అలవాటుమీద ఇది రెండో

సవాలు. పాపం శ్యామల తన సిగరెట్ పొగతో చాలా బాధ పడింది. ఆమెకి కళ్ళనీళ్ళు పర్యం కావడం తాను చూస్తూనే ఉన్నాడు. వాస్తవంగా తన నోరూ సిగరెట్లవాసన కొడుతూండవచ్చును. నిజంగా శ్యామలకి బాధాకారణమే!

ఒక గంట గడిచింది. అంతా నిశ్శబ్దం.

పొగమధ్యనించి అతను శ్యామల కూర్చున్న కుర్చీవైపు చూశాడు. పాపం; శ్యామల నిశ్శబ్దంగా ఏడుస్తోంది. వాసు హృదయం ఇంక కరగకుండా ఉండలేకపోయింది.

"సిగరెట్స్ మానేస్తాను శ్యామాలా!"

సానునయంగా శ్యామలతో విన్నవించుకున్నాడు. లోకమంతా ఏకమై సాధించలేని కార్యం కొన్ని నీటిచుక్కలు సాధించాయి. ఆ విజయానందం ఇద్దరూ పంచుకున్నారు.

"గెలిచావు శ్యామలా! వాసు ఉదయంనించీ సిగరెట్ కాల్చలేదు!"

శకుంతల పక్కగదిలోంచి వాసు తమ సంభాషణని వింటోన్న సంగతి తెలిసికోకుండా శ్యామలతో అన్నది.

శ్యామల నవ్వుతూ "మీ పందెం గెలిచాగా? ఇంక అక్కడ పెట్టండి పందెం" అన్నది.

వెంకట్రామయ్య ఇంట్లోకి వస్తూ శకుంతలతో—"ఏమిటే ఆ పందెం?" అన్నాడు.

"మా చెల్లెలు వాసుచేత సిగరెట్లు మాన్పించింది! నన్ను పందెం ఇమ్మంటోంది- ఎవరికి మంచో వారికే గెలుపూను!" అంది శకుంతల ఫిర్యాదు చేస్తూన్నట్లు శ్యామలవేపు కంటికొనతో చూస్తూ.

"వాసు సిగరెట్స్ మానేశాడా?" అని సంతృప్తిగా అని లోనికి వెళ్ళిపోయాడు వెంకట్రామయ్య.

"నా పందెం ఎగగొట్టేస్తావా అక్కా?" అంది శ్యామల మళ్ళీ.

కొంచెం ఆగి, శకుంతల చిన్నగా నవ్వుతూ, అర్ధగాంభీర్యంతో "వానూ నేనూ ఓడిపోయాం. నీ ఇష్టంవచ్చినట్లు చేసుకో" అంది. శ్యామల తలవంచుకుంది.

* * *

వాసు గుండెలు వదిన కెలుకుతూంది.

రేడియోలో ఏదో చిన్న సంగీతం వినిపిస్తూంది. వాసు ఆలోచనలో పడ్డాడు. వదిన, భార్య వీళ్ళమధ్య ఊగులాడుతున్నాడు.

ఇంతటిలో వదిన కాఫీ తెచ్చింది,"సిగరెట్స్ మానేశావుగా. చూడు ఎంత శుభ్రంగా ఉందో ఇల్లు!"

వాసు వెనకదిరిగి వదినకళ్ళల్లోకి చూశాడు; అదే చిరునవ్వు; అదే మాతృత్వం.

టిన్‌లోంచి సిగరెట్ తీసి ముట్టించాడు. శకుంతల తెల్లబోయి చూస్తూంది.

"నేను సిగరెట్లు మానలేదు వదినా!"

శకుంతల ముఖంలో ఒక్కసారి వైవర్ణ్యమూ, దాని వెనకనే ఏదో సంతృప్తీ కనిపించాయి. ఆమె కాఫీకప్పుని టేబిల్ మీద ఉంచుతూ చిన్నగా నవ్వింది.

సిగరెట్ పొగ కిటికీలోంచి బైటికి పోతూ గాలిలో కలిసి పైకొండలనీ, చక్కటిదృశ్యాన్నీ కనపడనీయడం లేదు.

కాఫీ ఒక్క గుక్కలో ముగించి, వెళ్ళిపోతోన్న శకుంతలని చూసి, "వదినా?" అని పిలిచాడు వాసు.

ఆమె వెనుదిరిగింది. "ఏం బాబూ?"

"నువ్వు నామీద ఒడ్డిన పందెం ఎవ్వరూ గెలవలేరు వదినా?"

సిగరెట్ కాలుతోంది. ఒక్క క్షణం నిశ్శబ్దంగా గడిచింది.

"నాకు తెలుసును బాబూ!" అంది శకుంతల తృప్తిగా.

---

మరి కృష్ణ-పెన్నార్ సంగతి?

రామపాదసాగర్ ప్రాజెక్టు విషయంలో అది కేంద్రప్రభుత్వం చేయవలసిన పని చాలా డబ్బుతో కూడుకున్న వ్యవహారం. చాలా పెద్ద ప్రాజెక్ట్. మా కందరికీ కావలసిందే. అయితే ఆ ప్రాజెక్టు నిర్మాణానికి కావలసిన పరికరాలు కొరతగావున్నవి. ఇంజినీర్లు ప్రస్తుతం చాలినంతమంది లేరు. అందుచేత అది ఆపుదల చెయ్యబడింది.—ఏలూరు సభలో శ్రీ సంజీవరెడ్డి.